# బూడిదలో పన్నీరు

"నువ్వు రూమ్‌లోనే వున్నావా? బైటికి పోలేదా?" అంటూ లోపలికి వచ్చాడు సుధాకర్ పూర్వంకన్నా కొంచెం కొత్తగా. రామారావు శెలవు వచ్చీ రాగానే హాస్టల్ రూమ్‌కి తాళం పెట్టి బైటికి పరిగెత్తే రకం కాడని తెలిసి కూడా.

సుధాకర్‌ని చూడగానే నవ్వు మొహంతో రామారావు "లేదులే, రా, రా! ఇప్పుడే కాస్సేపు పడుకుని లేచాను. అందరూ బైటికి పోయినట్టున్నారే!" అంటూ చేతిలో నవల పక్కనపెట్టి మిత్రుణ్ణి ఆహ్వానించాడు.

సుధాకర్ తనకు స్నేహితుడనుకుంటే రామారావు కెంతో సంతోషంగా వుంటుంది. కానీ ఆ మాట బైటికి చెప్పడానికి సంకోచిస్తాడు.

"సుధాకర్ మీ క్లాస్ మేటట కదా! మీకు బాగా తెలుసా?" అని ఎవరైనా అడిగితే, "తెలుసు" అని వూరుకుంటాడు గానీ, "నా ఫ్రెండే" అనలేడు — తను అలా చెప్పుకోడం సుధాకర్‌కి నచ్చుతుందో లేదో అనీ, తనకు అంత అర్హత వుందో లేదో అనీ.

సుధాకర్ మంచి కవితలు రాస్తాడు. చాలామంది మెచ్చుకుంటారతన్ని. ఎక్కువగా ప్రేమ కవిత్వం రాస్తాడు. కవిత్వాలంటే తలతిప్పేసే స్టూడెంట్స్ కూడా అతని కవితలు కొన్నయినా చదివి వుంటారు. లెక్చరర్స్ కూడా అతన్ని గురించి — "కొన్ని బాగా రాశాడు" అనడం విన్నాడు రామారావు. పూలనించి సన్నని పరిమళాలు తేలినట్టుగా, అతని కవితల్లో, ముఖ్యంగా ప్రేమ కవితల్లో, సున్నితమైన భావాలు కనపడి మనసుకెంతో సంతోషాన్నిస్తాయి.

"డిక్షనరీలన్నీ వెతికి నాజూకు మాటలు పడేస్తే సరి, కవిత్వం ఎంత నాజూగ్గా అయినా తయారవుతుంది" అన్న వాళ్ళని చూసి, వాళ్ళ అసూయని అసహ్యించుకున్నాడు రామారావు చాలాసార్లు. "డిక్షనరీలు అందరికీ అందుబాటులో లేవా? అందరూ ఆ నాజూకు మాటల కోసం ఎందుకు వెతుక్కోరూ? సుధాకర్‌లో, అతని భావాలే మృదువైనవి కాబట్టి, అతను అంత మృదువైన మాటలే వెదికి వెదికి పడేస్తాడు" అని వాదించాడు వాళ్ళతో చాలా సార్లు.

"తెలుగు ఎం.ఎ. వాళ్ళు కవిత్వం రాయడాని కేముంది లేవోయ్" అన్నాడొక సైన్సు స్టూడెంట్ ఒక సారి.

"మేమందరం తెలుగు ఎం.ఎ. వాళ్ళంకామా? సుధాకర్ ఒక్కడే ఎందుకు రాస్తున్నాడు?" అనగానే నోరుమూసుకున్నాడా స్టూడెంట్.

సుధాకర్ అంటే కొందరికి జెలసీ వున్నప్పటికీ, సుధాకర్ తమతో స్నేహం చేస్తే అది తమకెంతో కీర్తిగా భావిస్తారు — యూనివర్శిటీ హాస్టల్స్‌లో ఎక్కువమంది స్టూడెంట్స్. తనకేదో కీర్తి రావాలని రామారావు ఆశపడ లేదుగానీ, సుధాకర్ లాంటి వ్యక్తి తనని స్నేహితుడిగా గుర్తించాలని మాత్రం చాలా ఆశపడతాడు. అతను ఎప్పుడు తన రూమ్‌కి వచ్చినా అది తనకెంతో గౌరవంగా భావిస్తాడు.

గదిలోకి రాగానే గోడమీద కొత్త కేలండర్‌లో నదిలో పడవని చూస్తూ నిలబడ్డ సుధాకర్, తలతిప్పి రామారావుని చూస్తూ "ఈ వారం పత్రికలో నా కవిత చదివావా?" అన్నాడు.

"'నీకోసం ఆకాశం వెతికాను!' అన్నదేనా? ఇంకోటి కూడా వచ్చిందా?"

"అదే."

"పొద్దున్నే చదివాను లైబ్రరీలో. చాలా గొప్పగా వుందోయ్. నువ్వెంత సున్నితంగా ఆలోచిస్తావో నని పిస్తుంది. నీలాంటి కవులు చెపితేనేగానీ అలాంటి భావాలు కలలో కూడా రావు నాలాంటి వాళ్ళకి" అని నవ్వాడు రామారావు.

సుధాకర్ కేలండర్ కాయితాలు తిరగేస్తూ నించున్నాడు.

"మళ్ళీ ఏదైనా పంపావా?"

"'జ్యోతి'లో ఒకటి రావాలి వచ్చేవారం. ఏదో ఒక పత్రికవాళ్ళు అడుగుతూనే వుంటారు. నేనే పంపలేక

పోతున్నాను.''

"రోజూ ఒకటి రాసెయ్యరాదూ? నీ చేతిలో పనేగా?''

"మూడ్ వుండొద్దూ? ఫీలింగ్స్ రావొద్దూ?''

"నీలాంటివాడికి ఏ చెట్టుని చూసినా, ఏ పుట్టని చూసినా, ఫీలింగ్స్ వస్తాయిలే. అందులోనూ మన కేంపస్‌లో! సాయంకాలాలు కేంపస్‌లో తిరుగుతోంటే నాకే కవిత్వం పుట్టుకొచ్చేస్తుందే'' అని నవ్వాడు రామారావు.

సుధాకర్ మంచంమీద వున్న నవలతీసి కాసేపు తిరగేశాడు. "నువ్వు చదివాక ఇది నాకివ్వరాదూ?'' అన్నాడు.

"కావాలంటే ఇప్పుడే తీసుకో. చాలా బాగుంది. ప్రకృతిని చాలా సహజంగా వర్ణించాడు. అరే! రోజూ చూసేవేనే ఈ దృశ్యాలన్నీ. నేను ఇలా చూడలేదు'' — అనిపించింది ఈ వర్ణనలు చదువుతోంటే. పెద్దగాలి మైదానం నిండా తెరలు తెరలుగా పరిగెత్తిందంటూ ఒక పేరా ఎంత సహజంగా వర్ణించాడోయ్! ఆశ్చర్యం వేసింది. మిట్టమధ్యాహ్నపు చెట్లు తమ నీడల్ని ఎండ లోకి పోవద్దని దగ్గరే వుంచుకున్నాయి — అన్నాడు. ఎంత బాగుందో కదూ? నువ్వు చదివితే ఇంకా ఎంజాయ్ చేస్తావేమో! తీసికెళ్ళి చదువు.''

"ఇప్పుడొద్దులే. తర్వాత తీసుకుంటాను'' అని సుధాకర్ పుస్తకం మంచంమీద పెట్టేసి, మళ్ళీ కేలండర్ వేపు చూస్తూ నించున్నాడు. తలతిప్పి ఏదో చెప్ప బోయినట్టు చూశాడు. ఆగాడు. ఎందుకో సందేహించాడు. మళ్ళీ కేలండర్ చూస్తూ హఠాత్తుగా "సుశీల ఉత్తరం రాసిందోయ్'' అన్నాడు.

"సుశీలెవరు?''

"సుశీలెవరేమిటి! సుశీల తెలీదా నీకు?''

సుశీలెవరన్నాడేగానీ, ఆ ప్రశ్న వెనకే, సన్నగా, పొడుగ్గా కొంచెం చామనచాయ రంగు అమ్మాయి, పెద్దపెద్ద కళ్ళూ, పెద్ద జడా, బాగా పరిచయమైన అమ్మాయి గుర్తొచ్చింది.

"మన సుశీలా?''

"ఊఁ......''

"ఉత్తరం రాసిందా? ఊఁ, రాస్తే?''

"మామూలు ఉత్తరం కాదు.'' సుధాకర్ కొంచెం నవ్వాడు — "ప్రేమ లేఖ రాసింది.''

ఆశ్చర్య పడ్డాడు రామారావు — 'ప్రేమ లేఖా?' అనే కుతూహలం తోటీ, 'ప్రేమ లేఖ సంగతి తనకి చెప్పడం ఏమిటీ?' అనే సందేహం తోటీ.

"చూస్తావా?'' అంటూ కొంచెం తారట్లాడి సుధాకర్ జేబులోంచి కవరు బైటికి తీసి రామారావుకి ఇవ్వబోయాడు.

"అబ్బే, నాకెందుకూ?'' అని కంగారు పడ్డాడు రామారావు.

"ఫర్వాలేదు చూడు, నేనే ఇస్తున్నాగా?'' అని సుధాకర్ కవరులోంచి ఉత్తరం తీసి రామారావు కివ్వబోయాడు.

రామారావు తీసుకోకుండా "వద్దోయ్. నేనెందుకు చూడ్డం?'' అంటూ ఇబ్బంది పడ్డాడు.

"అయితే నేనే చదివి వినిపిస్తాలే'' అని సుధాకరే ఉత్తరం విప్పి చదవడానికి సిద్ధపడుతోంటే రామారావు సిగ్గుపడిపోయి — "వొద్దొద్దు. నేనే చదువుతాలే'' అని ఉత్తరం లాక్కున్నాడు.

సుధాకర్ మళ్ళీ కేలండర్ పేజీలు తిరగేస్తూ బొమ్మలు చూస్తూ నించున్నాడు.

రామారావు చాలా సంకోచపడుతూ — "ఆ అమ్మాయి ఉత్తరం నేను చదవడమేమిటి?'' అని నొచ్చుకుంటూ చదవడం మొదలెట్టాడు.

సుధాకర్ గారికి,

నేను సుశీలనండీ! రోజూ మీకు క్లాసులో కనపడే సుశీలని. మీ కవితలు చదివి మతిపోగొట్టుకుంటూ వుంటాను. 'నీ కోసం ఆకాశం వెతికాను' కవితలో, మీ భావన ఎంత విశాలమో, ఎంత ఉన్నతమో చూసి మీరంటే భక్తి భావం మరింత స్థిర పరచుకుంటు న్నాను. మీ కవితల్లోని లలితమైన ఊహలు నా మనస్సులో ఎప్పుడూ తారట్లాడుతూ వుంటాయి.

'నీ కోసం ఆకాశం వెతికాను' కవిత చదవుతోంటే, ఎంత సంతోషపడ్డానో అంత నిరుత్సాహపడ్డాను. ఈ భూమిమీద ఏ అమ్మాయీ, ఎన్నటికీ, మీ హృదయాన్ని ఆకర్షించలేదేమోనని! మీరు కలలుకనే ఆ స్వప్న సుందరి ఈ భూమిమీద లేనే లేదేమోనని! అందుకే కదా మీరు ఆకాశంలో వెతుకుతున్నది?

నే నెన్నడూ మీతో మాట్లాడలేదు. మీరు క్లాసుకి రాకపోతే నాకా పూట క్లాసులో ఉండబుద్ధి వెయ్యదు. ఈ మధ్య అయితే నిజంగా నేను మీ కోసమే క్లాసుకి వస్తున్నాను. క్లాసులో మీరు లేకపోతే వెంటనే వెళ్ళి పోయే ధైర్యంలేక అలాగే జీవచ్ఛవం లాగా కూర్చుం టానుగానీ చదువుకోసం కాదు.

మొన్న ఒకసారి మీరు లైబ్రరీలో పత్రికలు చూస్తూ కూర్చున్నారు. 'మీ కవిత నేను చదివానండీ' అని మీ దగ్గరికి వచ్చి చెప్పాలని యెంత ప్రయత్నించాను! మీరున్న వేపు వచ్చానుకూడా. కానీ నోరు విప్పలేక పోయాను. ఎంత ప్రయత్నించినా నా కంఠం పెగల లేదు. నాకే ఆశ్చర్యం వేసింది. కంఠంలో నిజంగా యేమైనా జబ్బు చేసిందేమోనని భయం వేసింది. బయటికి వెళ్ళాక కూడా దూరంగా రమణి కనపడితే పిలవాలని ప్రయత్నించి పిలవలేకపోయాను. కళ్ళ ల్లోంచి జలజలా నీళ్ళొచ్చేశాయి. ఇదంతా నమ్మరేమో మీరు.

వారం రోజుల కిందట మీరుకూడా నన్ను చూశారు బస్‌స్టాప్‌లో. గుర్తుందో లేదో మీకు. మూడో నెంబరు బస్సులో ఎక్కి వెళ్ళారు మీరు. ఆ బస్సు ఎంత పవిత్రం అయిపోయిందో ననుకున్నాను. మీరు ఏ సీటులో కూర్చుంటారో, మీరు దిగిపోయిం తర్వాత ఆ సీటులో ఎవరు కూర్చుంటారోనని ఆలోచిస్తూ రెండు బస్సులు పోగొట్టుకుని ఎప్పటికో ఇంటి కొచ్చాను. అప్పటి నించే మూడో నెంబరు బస్సుని చూస్తే ఎంత ఇష్టమో నాకు! నవ్వుతున్నారా నా మాటలకి?

పదిరోజుల కిందట ఒకసారి నేనూ, రమణీ లాండ్‌స్కేప్ గార్డెన్‌లో చాలాసేపు కూర్చుని వెళ్ళడానికి లేచాం. అంత వింతగా ఎటునించి వచ్చారో మా ముందే మీరు మెట్లు ఎక్కి వెళ్తూ కనిపించారు. మీ పాద స్పర్శసోకిన ఆ మెట్లమీద ఇంక ఎవ్వర్నీ నడవ నివ్వకూడదనిపించింది. ఆ మెట్లమీద పడి మెట్టు మెట్టునీ ముద్దు పెట్టుకోవాలనిపించింది. నాకు పిచ్చి పడుతుందేమోనని భయపడ్డాను నిజంగా. ఒకసారి రమణి భుజంమీద చెయ్యివేసి నడుస్తూ దాని భుజం మీద వేళ్ళతో అక్షరాలు రాస్తున్నానట. "ఏమిటే రాస్తు న్నావూ?" అంది. "ఏం రాస్తున్నాను?" అని తెల్ల బోయాను. "'సు' అని రాశావు" అంది. ఏం చెప్పాలో తోచక కంగారుపడిపోయాను. నా పేరు సుశీల కాబట్టి ఎలాగో బతికిపోయాను. దానికి నిజం చెప్పాలంటే ఎలా అర్థం చేసుకుంటుందోనని భయం. మీరు నవ్వు తారేమోగానీ ఎప్పుడూ నాకు పెన్ను పట్టుకుని పుస్త కాల నిండా సుధాకర్, సుధాకర్, సుధాకర్, సుధాకర్ అని రాస్తూనే వుండాలనిపిస్తోంది. మెలుకువలోనూ, నిద్రలోనూ ఎప్పుడూ నా హృదయం సుధాకర్‌నే జపిస్తూ వుంటుంది. సిగరెట్లు కాల్చేవాళ్ళని చూస్తే ఇప్పటికీ నాకు అసహ్యమే. కానీ ఆశ్చర్యం! మిమ్మల్ని చూస్తే అలా వుండదు. సిగరెట్లు కాల్చడం మీకు అంత ఇష్టమేమోననిపిస్తుంది. కాల్చేవాళ్ళందరికీ ఇష్టమయ్యే కదా కాలుస్తారు? కానీ ఇతరుల్ని గురించి నేనలా సరిపెట్టుకోలేను. మీ ఒక్కరిలోనే నేను తప్పులు పట్టలే ననుకుంటా! మిమ్మల్ని ఆరాధించటమే నా జీవితాదర్శమేమో, అందుకే నేను పుట్టానేమో నని పిస్తోంది. ఇదంతా మీతో చెప్పాలని నాకు లేదు. కానీ, చెప్పకుండా వుండలేకపోతున్నాను.

మీ కవితలు కొన్ని ఆల్బమ్‌లో పెట్టి జాగ్రత్త చేశాను. నాకు దొరకని వెన్ని వున్నాయో తెలియదు. ఎప్పుడూ అవి చదువుతూ వుంటాను. మీ 'వసంత రాగం' కవితని వీణమీద వాయించాలని ఒక రోజంతా ప్రయత్నించి స్వరం కట్టాను. మా సంగీతం మేష్టారికి చూపిస్తే స్వరం కరెక్టుగానే వుందన్నారు. ఎప్పుడైనా మీ దగ్గర ఆ పాట వాయించి వినిపించాలని నా కోరిక. మీ గురించి నా మనసులో కలిగే ఊహలన్నీ కాయి తాలమీద పెడితే ఎన్ని వేల లేఖ లవుతాయో! మిమ్మల్ని విసిగిస్తున్నానేమో, మూర్ఖురాల్ని!

ఈ మధ్యే గోలెంలో ఒక తెల్ల గులాబీ మొక్క పాతాను. దానికి 'సుధ' అని పేరు పెట్టాను. ఇంటికి రాగానే "నా 'సుధ' ఎలా వుంది?" అని ముందు దాని దగ్గరికి పోతాను. ఇంట్లో వాళ్ళందరికీ ఆశ్చర్యమే. ఆ మొక్కమీద నాకంత ప్రేమేమిటని. నా 'సుధ' రోజూ ఒక్కొక్క ఆకు తొడుగుతూ వుంది. మీరు అనుమతిస్తే నేనిట్లా యుగ యుగాలకూ రాయగలను. మిమ్మల్ని విసిగిస్తున్నానేమోననే భయంతోనే ఇంక ఆపు

తున్నాను. నా ఊహలూ నా కలలూ మీకు విసుగు కలిగిస్తే మన్నించరూ? రోజూ ఒక ఉత్తరం రాయడానికి నాకు అనుమతి ఇవ్వరూ?

ఎన్నటికీ మీ స్నేహాన్ని కోరే
మీ సుశీల.

మీ అనుమతి లేకుండా 'మీ సుశీల' అని రాయడం తప్పని నాకు తెలుసు. కానీ, నేను నా వశంలో లేను. ఉత్తరాల్లో, ఇలా చెప్పుకోడానికి నాకు అనుమతి ఇవ్వండి! ఆ సంతోషం చాలు?

మీ సుశీల

రామారావు కళ్ళు చెమర్చాయి. చప్పున కళ్ళు తుడుచుకున్నాడు. మాట్లాడలేకపోయాడు.

సుధాకర్ కేలండర్ మీదనించి దృష్టి తిప్పి "చదివావా?" అన్నాడు.

"ఊఁ" అని ఉత్తరం మడిచి సుధాకర్ చేతికి ఇచ్చాడు.

"అదేమిటి? అలా వున్నావేం?"

"ఛ! ఏం లేదు" అని తడికళ్ళతో చిరునవ్వు నవ్వాడు.

"ఎలా వుంది ఉత్తరం?"

రామారావు మళ్ళీ నవ్వి వూరుకున్నాడు.

సుధాకర్ కాసేపు ఆగి "'ఎంతదృష్ట వంతుడివో' అంటావనుకున్నానే!" అన్నాడు నవ్వుతూ.

"వేరే అనాలా?" అని నేల చూపులు చూశాడు రామారావు.

"వెళ్తాను" అన్నాడు సుధాకర్ కాసేపు నిలబడి.

"మరి జవాబు రాశావా?"

"లేదింకా. నిన్న పొద్దున్నే అందింది."

రామారావు చాలా ఆశ్చర్యపడ్డాడు.

"ఏం రాద్దామనుకుంటున్నావు?" అని అడగబోయి మాట ఆపుకున్నాడు.

"వెళ్తానోయ్! ఈ సంగతి ఎక్కడా అనకేం?"

"నేనెందుకంటాను?"

"మాటవరసకి అన్నాలే.... సరే, వెళ్తా...." ఉత్తరం జేబులో పెట్టుకుని గబగబా వెళ్ళిపోయాడు.

రామారావు మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు గానీ చదవలేక పోయాడు.

తన అడ్రస్ కూడా ఇస్తూ ఉత్తరం రాసింది. ఎంత ధైర్యమో! ఆమెకొచ్చే ఉత్తరాలు ఇంట్లో వాళ్ళెవరూ చూడరేమో!

పుస్తకం తెరిచాడు. కాస్సేపటికే అది మూత బడింది.

'ప్రేమ' అంటే ఇలా వుంటుందా!

సుశీల ఆ అనుభూతిలో తల మునకలైపోతోంది! అదంతా అతనితో చెప్పకుండా ఎలా వుంటుంది?

మంచి పని చేసింది. అంతే, మనసు విప్పి చెప్పెయ్యాలి. చెప్పకపోతే ఎలా తెలుస్తుంది. రెండో మనిషికి?

నిజంగా సుధాకర్ అదృష్టవంతుడే!

కానీ.... సుధాకర్.... ఏదోలా వున్నాడేవిటి?

నిన్న అనగా ఉత్తరం వొస్తే ఇంకా జవాబివ్వకుండా ఎందుకు వుండాలి? ఇష్టం లేదా? ఆ సంగతైనా తొందరగా చెప్పాలిగా? పాపం ఏమైపోతుందో ఇష్టంలేదని రాస్తే? కాదు. సుధాకర్ ఇష్టంగానే వున్నట్టున్నాడు. అయినా తనని నమ్మి ఒక ఆడపిల్ల రాసిన ప్రేమ లేఖని ఇంకో వ్యక్తికి చూపించడం ఏమిటి? సుధాకర్ తనని ఇంత అప్తుడిగా భావిస్తున్నాడా? అతని మనసు నిజంగా ఆనంద సముద్రమైపోయినట్టుంది. సంతోషం ఆపుకోలేక చూపించాడేమో!

ప్రేమ అనేది ఒక్క హృదయంలోనే చిలవలూ, పలవలూ వేసి పెరుగుతుందా? రెండో మనిషి మనసు తొందరగా తెలుసుకోకుండా ఇంతకాలం బాధపడడం ఎందుకో పిచ్చి అమ్మాయి! పైకి ఎంత సామాన్యురాలిగా కనపడుతుంది! మనసులో ఎంత ప్రేమ ధనమో! మనసుకెంత ప్రేమించే శక్తో! ఎవరి మనసులో ఏం జరుగుతుందో, ఎవరి హృదయ మెందుకు కల్లోల పడుతుందో, రెండో మనిషి గ్రహించలేడు కదా, ఎంత దగ్గిరిగా వున్నా!

నిన్న, సుశీల తనకు పక్క బెంచీలోనే కూర్చుంది. ఇప్పుడాలోచిస్తే, గుర్తు తెచ్చుకుంటే, సుశీల నిన్న చాలా ముభావంగా వున్నట్టనిపిస్తోంది గానీ, అప్పుడు అయితే అలా అనిపించనేలేదు.

అవతల వ్యక్తి గాఢంగా ప్రేమిస్తోంది కాబట్టి ఇవతల వ్యక్తికి కూడా ప్రేమ కలగవలిసిందేనా? కలుగుతుందా?

అలాంటి ఉత్తరం తనకే వస్తే, ఏమైపోయేవాడో తను? చిక్కుల్లో పడేవాడే! లేకపోతే తనకు కూడా ప్రేమ మొదలయ్యేదా?

రామారావు చదువు సాగక రూమ్‌కి తాళంపెట్టి, లైబ్రరీవేపు బయల్దేరాడు! మళ్ళీ అవే ఆలోచనలు! సుశీల ఉత్తరం గురించే. రేపు క్లాసులో సుశీల మొహం జాగ్రత్తగా చూడాలి. ఇతనేం రాస్తాడో జవాబు!

"ఏంటోయ్, ఎంత పిలిచినా పలకవేం?" అంటూ రామారావు భుజం మీద చెయ్యేశాడు రవికుమార్.

"పిలిచావా? వినపడలేదే!"

"ఏం అంత పరాకూ? నీకూ లౌ లెటర్ వచ్చిందా?"

"నీకూ - అంటే? ఎవరికన్నా వచ్చిందా?"

"ఎవరితోటీ అనకుగానీ, సుశీల సుధాకర్‌కి లౌ లెటర్ రాసిందోయ్."

నిర్ఘాంతపోయాడు రామారావు.

"ఎవరు చెప్పారు నీకు?"

"సుధాకరే చెప్పాడు. చెప్పడం ఏంటీ? నేను స్వయంగా చూశాను ఉత్తరం."

తెల్లపోతున్నాడు రామారావు.

"నమ్మవా నా మాట?"

రామారావు తనని తను సర్దుకోడానికి ప్రయత్నిస్తూ — "నమ్మక పోడానికేముంది ఇందులో? రాస్తే రాసుండొచ్చు" అన్నాడు.

"భలే రాసిందోయ్ — ఆశ్చర్యమేసింది చదువుతుంటే."

"ఏం?"

"ఆడపిల్లలకు అంత సాహసం చేస్తారా?"

"ఆడప్లిలకు ప్రేమ రాదా? ప్రేమ ఎవరికి కలిగితే వాళ్ళు సాహసం చేస్తారేమో."

రవికుమార్‌తో మాట్లాడుతున్నాడేగానీ సుధాకర్ చేసిన పని గురించి ఆశ్చర్యంతో తలమునకలై పోతున్నాడు రామారావు. సుశీల ఉత్తరం రవికుమార్‌కి కూడా ఎందుకు చూపించాడు? చెప్పాలంటే, తనకన్నా రవికుమారే ఎక్కువ స్నేహితుడు సుధాకర్‌కి. ఎప్పుడూ కలిసి తిరుగుతూ వుంటారు. తనకే చూపించినప్పుడు రవికుమార్‌కి, చూపిస్తే తప్పేమిటి? తను ప్రేమించినా, తనని ప్రేమించినా, ఆ విషయాలు సిగ్గుపడి దాచుకోవలసిన విషయాలా? సుధాకర్ సంతోషంగానే చెప్పుకున్నాడేమో స్నేహితుడికి? అతను ఇతనికి చెప్తే చెప్పాడు. ఇతను మళ్ళీ ఇంకోరితో అనడం ఎందుకూ?

"సుశీల ఇలాంటిదని ఎప్పుడూ అనుకోలేదోయ్!"

"ఇలాంటిదంటే?" చురుగ్గా చూశాడు రామారావు.

"అదే, ప్రేమించడం అదీ .... భలే రాసిందిలే. అమ్మాయిలందరూ ప్రేమ లేఖలు రాస్తారంటావా? నోరు మూసుకుని పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసేసుకుంటారు."

"అబ్బాయిలూ అంతే. ఆ మాటకొస్తే అమ్మాయిలే చాలా సాహసం చేస్తారు."

"సాహసం అంటావా అది?"

"ఏం, కాక?"

"అలా రాస్తే ఏం బాగుంటుందోయ్? పెద్దవాళ్ళకి చెప్పి వాళ్ళద్వారా అడిగించొచ్చుగా?"

"అయితే వాళ్ళ తాత వచ్చి వీళ్ళ తాతని అడగాలన్నమాట!"

"ఏం కాదులే. వాళ్ళ నాన్నగారు వచ్చి వీళ్ళ నాన్నగార్ని అడిగితే మర్యాదగా వుంటుంది."

"తాతలైతే నాన్నలకన్నా పెద్దవాళ్ళుగా? తాతవచ్చి అడిగితే ఇంకా మర్యాదకాదూ? ముత్తాత వస్తే మరీ మర్యాద."

"చాల్లేవోయ్ నీ మాటలూ."

"ఇంతకీ సుధాకర్ అభిప్రాయం ఎలావుంది? నీతో ఏమన్నా అన్నాడా?" అని రామారావు రవికుమార్‌ని అడుగుదామనుకున్నాడు గానీ, అడగాలంటే సుధాకర్‌నే అడగాలి ఇతన్ని అడగడం ఎందుకూ? రామారావిలా అడిగాడని ఇతను మళ్ళీ అతనితో అంటే, చాలా అసహ్యంగా వుంటుంది. 'ఆ మాట నన్నే అడక్కపోయాడా' అని అతను అనుకుంటే? కావాలంటే అతన్నే అడగొచ్చు. 'ఏం జవాబు రాశావోయ్?' అంటే అతనే చెపుతాడు.

"ప్రేమ అంటే ఏంటి గురూ? మొగాళ్ళతో తిరగాలనిపిస్తుందా?" అన్నాడు రవికుమార్ నవ్వుతూ.

రామారావు కొంచెం ఆశ్చర్యంగా చూశాడు రవికుమార్‌ని. సుశీల ఉత్తరం చదివితే మొగాడితో తిర

గాలనే అర్థమే కనిపించిందా ఇతనికి?

"ఇంకెవరూ అనలేదా గురూ ఆవిడ కళ్ళకి? ఆయన కవిత్వం, గివిత్వం వొలికిస్తాడు కదా?"

"ఏయ్, రవికుమార్!" అని ఎవరో పిలిచారతన్ని.

"వొస్తా గురూ!" అంటూ రవికుమార్ వాళ్ళవేపు గబగబా వెళ్ళిపోయాడు. అతని ఉత్సాహం చూస్తే "వాళ్ళతో కూడా చెపుతాడా?" అని ఒక్కసారి గుండె గబగబ కొట్టుకుంది రామారావుకి. మళ్ళీ వెంటనే — "ఛ, ఎందుకు చెపుతాడు?" అని శాంతపడ్డాడు.

సుధాకర్‌కి ప్రేమలేఖ వచ్చిందంటే ఇతనికి అసూయగా వుందా? 'ఇంకెవరూ అనలేదా ఆవిడ కళ్ళకి?' అంటాడేవిటి? ఒక మనిషి కళ్ళకి ఎంత మంది అనుతారు? ఎవరో ఒక్కరే అనుతారు కదా?

ఆశ్చర్యంతో తలమున్కలవుతున్నాడు రామారావు! ఇతను సుధాకర్‌ని తన క్లోజ్ ఫ్రెండని చెప్పుకుంటాడు. సుధాకర్ కవిత్వం ఇంత గొప్పదనీ, అంత గొప్పదనీ పొగుడుతాడు. 'ఆయన కవిత్వం - గివిత్వం వొలికిస్తాడు కదా' అని అంత వెటకారంగా మాట్లాడతాడేవిటి? అని రవికుమార్ మాటలు తల్చుకుని చాలా ఆశ్చర్యపడ్డాడు రామారావు!

'ఇలాంటివాణ్ణి ఎలా నమ్ముతున్నాడు సుధాకర్? సుధాకర్‌ని చూసి ఇతనింత కుళ్ళుకుంటున్నాడా? పాపం ఇతనేదో మంచి స్నేహితుడని సుధాకర్ భ్రమ పడుతున్నాడే!'

సుధాకర్‌ని గురించి ఆలోచిస్తోంటే, మధ్యాన్నం అతను వేసుకున్న చారల షర్టు గుర్తొచ్చింది ఎందుకో. మధ్యాన్నమే అనిపించింది — ఏమిటంత జీబ్రాచారలని! సుధాకర్ ఎప్పుడూ జీబ్రాచారల షర్టులూ నాపరాళ్ళ గళ్ళ షర్టులూ వేస్తాడు. అతని బట్టల సెలక్షన్ రామారావుకి నచ్చదు. అతని బట్టల గురించి సుశీల ఏమనుకుంటుందో! చెప్పిందిగా, అతను సిగరెట్లు కాల్చినా నచ్చుతాడని! ఏ క్షణాల్లో ఆమె మనసుని ఆకర్షించాడో! ఒకసారి ఇష్టం కలిగితే, ఏ బట్టలేసినా, ఎలా ప్రవర్తించినా, అందంగానే, ముద్దుగానే, కనపడుతుందేమో! కాంతి ఎక్కువైతే కళ్ళు చీకట్లు కమ్మినట్టు, ప్రేమ ఎక్కువైతే మనసు మూర్ఖం అయిపోతుందేమో! తను చెప్పనే చెప్పింది కదా సుధాకర్‌లో లోపాలు చూడలేనని.

సుధాకర్ గురించి ఇలా ఆలోచిస్తున్నా నేమిటని ఆశ్చర్యపడ్డాడు రామారావు. తనుకూడా అసూయ పడుతున్నాడా కొంపదీసి, సుధాకర్‌ని చూసి? లేకపోతే, సుధాకర్‌ని సుశీల ఎలా ప్రేమించ గలిగిందని తను ఆలోచించడం ఏమిటి, సుధాకర్‌లో ప్రత్యేకతే లేనట్టు?

రామారావు ఎనిమిది గంటల వరకూ లైబ్రరీలో కూర్చుని మెస్‌కి బయల్దేరాడు. దారిలో హిందీ డిపార్టుమెంటు మోహన్‌రావు కనపడ్డాడు. అతను రామారావుని నవ్వుతూ పలకరించి "ఇంతసేపున్నారేం?" అన్నాడు నిలబెట్టి.

"ఏం లేదు. లైబ్రరీలో కూర్చున్నాను. వెళ్తాను" అని రామారావు కదలబోతోంటే "మీ క్లాస్‌మేట్ సుశీల ఎలాంటి మనిషండీ?" అని అడిగాడు.

రామారావు షాక్ తిన్నట్టు ఆశ్చర్యపడ్డాడు — "అంటే?"

"చెప్పండి! సుశీల గురించి మీకో న్యూస్ చెపుతాను."

"ఏం చెప్పాలి?"

"సుశీల ఎలాంటిది?"

"నాకేం తెలుసు?"

"క్లాస్‌మేట్ గురించి ఆ మాత్రం తెలీదా? ఆ అమ్మాయి సుధాకర్‌కి లౌ లెటర్ రాసిందండీ!"

"మీకెలా తెలుసు?"

"ఆ లెటర్ నా కళ్ళతో నేను చూస్తే! సుధాకరే చూపించాడు."

"సుధాకర్ మీకు బాగా ఫ్రెండా?"

"ఆఁ — ఫ్రెండే అనుకోండీ. ఎంత సిగ్గులేకుండా రాసిందనుకున్నారు! ఎంత అమాయకురాల్లా కనపడుతుందో పైకి!"

అతని మాటలు వినడంలేదు రామారావు. 'సుధాకర్ ఇలా చేస్తున్నాడా?' అని మ్రాన్పడిపోయాడు. తళతళ మెరిసే గాజు విగ్రహం కిందపడి భళ్ళున బద్దలైనట్టు, తను నమ్మిన నిజం చెల్లాచెదురై బ్రహ్మాండమైన రహస్యం బట్టబయలైనట్టు తోచింది. సుధాకర్ ఇలాంటివాడా! ఇంత.... ఇంత.... ఇలాంటివాడా!

తను అనుకున్న లాంటివాడు కానేకాదా? రామారావుకి తల తిరిగిపోతోంది. తన చెవుల్ని తను

నమ్మలేక పోతున్నాడు. నిజమేనా ఇదంతా? సుధాకర్ ఇంత దుష్టుడా? ఇంత హీనుడా? అంత మంచి కవి, అంత మంచి కవి! 'నాకు లౌ లెటర్ వచ్చింది. లౌ లెటర్ వచ్చింది' అని దాన్ని పట్టుకు వూరేగుతున్నాడా? ఇంకెంత మందికి చూపించాడో! వాళ్ళింకెంతెంత మందికి చెపుతున్నారో!

"సుధాకర్‌కి మేరేజ్ సెటిలైంది. తెలుసా మీకు?" అన్నాడు పక్కన నడుస్తూ మోహన్‌రావు.

మళ్ళీ ఉలిక్కిపడ్డాడు రామారావు. "మేరేజ్ సెటిలైందా? సుధాకర్‌కే!"

"ఏం, అంత ఆశ్చర్యపడుతున్నారు! ఆ అమ్మాయి ఫోటో కూడా చూపించాడు నాకు. వాళ్ళ బంధువు లేనట. బాగా ఆస్తిపరులట. ఆ అమ్మాయి ఎక్కువగా చదువుకోలేదటగానీ, చాలా అందంగా వుందండీ ఫోటోలో.... ఫోటోలు నమ్మలేం లెండి. కోతుల్లా వున్న వాళ్ళు కూడా రంభల్లా కనపడతారు ఫోటోల్లో. నిజంగా కూడా అందంగా వుంటుందన్నాడు సుధాకర్. అదృష్టవంతుల్లెండి."

"ఆ అమ్మాయిని ప్రేమించాడా సుధాకర్?"

"ప్రేమా గీమా లేదు. వాళ్ళ నాన్నగారు కుదిర్చిన సంబంధమే. పెళ్ళయ్యాక రాత్రీ పగలూ ప్రేమేలెండి" వెకిలిగా నవ్వాడు. మోహన్‌రావు.

తల తిరిగిపోతోంది రామారావుకి.

మోహన్‌రావు నవ్వుతూ — "పెళ్ళి కుదిరిపోయిన వాడికి ప్రేమలేఖ రాస్తే పాపం అతనేం చెయ్యగలడు? కావాలంటే కొన్నాళ్ళు ముచ్చట తీరుస్తాడు."

రామారావు భగ్గున మండి "ఛీ! ఎందుకలా మాట్లాడతారు?" అని చీదరించుకున్నాడు.

మోహన్‌రావు కొంచెం జంకి "నేనన లేదండీ బాబూ! సుధాకర్ అన్న మాటలే నేనన్నాను. 'ఏం రాస్తారండీ రిప్లై' అని అడిగితే నవ్వేసి వూరుకున్నాడు. 'ప్రేమ వేరూ, పెళ్ళి వేరూ' అని అతను చాలా సార్లు అన్నాళ్ళేండి. అయినా సుశీల గురించి అంటే మీకెందుకంత రోషం? ఎంతెంత గ్రంధాలు నడుపుతారో ఈ అమ్మాయిలు! మళ్ళీ ఏమీ ఎరగనట్టు పెళ్ళిళ్ళకి సిద్ధం! ఎకనామిక్స్ డిపార్టుమెంటు అమ్మాయి శకుంతల లేదూ? ఏం చేసిందో తెలుసా?" అని ఏదో చెత్త చెప్పబోతుంటే, రామారావు అతని మాటలు వినకుండా చరచరా వెళ్ళిపోయాడు.

మెస్‌కి వెళ్ళకుండా తిన్నగా రూమ్‌కి వెళ్ళిపోయాడు. మోహన్‌రావు ఎంత చెత్త వాగుడు వాగినా రామారావుకి వింత లేదు. వాడు మర్యాదగా మాట్లాడితేనే వింతపడాలి. అలాంటివాడుకూడా సుధాకర్‌కి ఫ్రెండే!

రామారావు మనసుకి భరించలేనంత క్షోభగా వుంది. తనకే ఘోరమైన అవమానం జరిగినట్టుగా వుంది. తనకీ అవమానమే, ఇదంతా! తన స్నేహానికే ఘోరమైన అవమానం!

సుశీలకి చెప్పెయ్యాలి అంతా! సుధాకర్ ఇంత నీచుడని చెప్పెయ్యాలి! తప్పకుండా చెప్పెయ్యాలి. కానీ.... నమ్ముతుందా? ఎవరి మాటలూ నమ్మనంటుందా? అతని స్నేహితులు నీ గురించి తెగ వాగుతున్నారంటే, అది సుధాకర్ తప్పెలా అవుతుందంటుందా? సుధాకర్ మీద అంత ప్రేమతో వున్న మనిషి, తను చెప్పగానే నమ్ముతుందా? తననే అపార్ధం చేసుకుంటుందా? ఎలాగైనా ఇతని సంగతి చెప్పి నమ్మించకపోతే ఈ నీచుడు ఏం రాసి మభ్యపెడతాడో ఆ అమ్మాయిని! తనకు పెళ్ళి కుదిరిన సంగతి చెపుతాడో లేదో! 'నువ్వంటే నాకూ ఇష్టమే' నంటాడేమో. ఆ అమ్మాయిని నమ్మించి, సర్వనాశనం చేసి.... నమ్మలేం. ఇలాంటివాళ్ళు ఎంత నీచానికైనా తెగిస్తారు.

సుధాకర్ మీద ఎంత కోపంగా వున్నా సుధాకర్ గురించి ఇంత ఘోరంగా ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడిందేమిటనే ఆశ్చర్యంలోంచి తేరుకోలేక పోతున్నాడు రామారావు.

రవికుమార్ చెప్పిందీ, మోహన్‌రావు చెప్పిందీ అంతా అబద్ధమేమో, అంతా తన భ్రమేమో, ఏమీ జరగలేదేమో — అనిపిస్తోంది మళ్ళీ. తనకా ఉత్తరం చూపించినప్పుడు సుధాకర్ ఏమీ అవకతవకగా మాట్లాడలేదే! వాళ్ళతో మాట్లాడి వుంటాడా? వాళ్ళే సందు దొరికిందని అతని మీద చెత్తచెత్తగా చెపుతున్నారా? అసలు అతనా ఉత్తరం అంతమందికి ఎందుకు చూపించాలి? అతను చూపిస్తేనే కదా వాళ్ళకి

తెలిసింది? అలా చేశాడంటే అందులోనే కావలసినంత నీచత్వం వుంది. ఎందుకలా చేశావని అతన్ని అడిగితే? అవును, అతన్నే అడగాలి. తనకేం మొహమాటం లేదు. అతన్ని అడిగి తెలుసుకున్న తర్వాతే సుశీలకు చెప్పడం మంచిది. అవును, సుధాకర్‌ని తప్పకుండా అడగాలి.

సుధాకర్‌ని అడగాలన్న ఆలోచన రాగానే గబగబా వరండా చివరికి వెళ్ళి అతను రూమ్‌లో వున్నాడా! అని చూశాడు. రూమ్ లాక్ చేసివుంది.

సుధాకర్‌ని అడగాలనుకున్న తర్వాత రామారావు మనసు కొంత శాంతించింది. తొందరపడి అతన్ని అపార్థం చేసుకున్నానేమో ననిపించింది. కానీ అతనికి పెళ్ళి కుదరడం నిజమైనా కాకపోయినా, ఆ ఉత్తరాన్ని ఒక్కరికి చూపించినా కూడా క్షమించరాని నేరమే.

సుధాకర్ రూమ్‌కి వచ్చాడేమోనని నాలుగైదుసార్లు వెళ్ళి చూసి వచ్చాడు. సినిమాలకీ, షికార్లకీ పోయిన స్టూడెంట్స్ ఇంకా రాలేదు. ఎంత అర్ధరాత్రి అయినా సరే సుధాకర్‌ని అడిగితీరాలని కూర్చున్నాడు రామారావు.

పది గంటల లోపలే సుధాకర్ వచ్చాడు. రూమ్ తాళం తీసి, బట్టలు మార్చుకుని పత్రికలు తిరగేస్తూ కూర్చునేప్పటికి రామారావు వెళ్ళాడు.

"నువ్వా" అని సుధాకర్ ఒకసారి తలెత్తి చూసి తనకేమీ పట్టనట్టు, మళ్ళీ పత్రికల్లో మునిగాడు.

అతనలా ప్రవర్తించాడన్న సంగతికూడా గమనించకుండానే రామారావు గదిలోకి వెళ్తూనే సీరియస్‌గా — "సుశీల ఉత్తరం గురించి అందరికీ ఎందుకు చెపుతున్నావు?" అన్నాడు.

సుధాకర్ ఒకసారి ఆశ్చర్యంగా చూసి "అందరికీ ఎవరికి చెప్పాను?" అన్నాడు.

"రవికుమార్‌కి చెప్పావు. మోహన్‌రావుకి చెప్పావు. ఇంకెవరికి చెప్పావో నాకు తెలీదు, వాళ్ళిద్దరూ నాతో అన్నారు."

"వాళ్ళు నా క్లోజ్ ఫ్రెండ్స్" అని ఇంకేం మాట్లాడకుండా సుధాకర్ మళ్ళీ పత్రిక చూడ్డం మొదలెట్టాడు.

"సుశీల గురించి వాళ్ళెంత చులకనగా మాట్లాడుతున్నారో తెలుసా?"

"అదన్న మాట నీ కంప్లయింట్!" అని వెటకారంగా నవ్వి "ఆ ఉత్తరంలో రాసింది చూస్తే వాళ్ళకలా మాట్లాడాలనిపించిందేమో! సుశీల గురించి మాట్లాడితే నీకేం?" అన్నాడు.

"నాకు కాదు, నీకుండక్కర్లా జ్ఞానం? నిన్ను నమ్మి ఉత్తరం రాసిన అమ్మాయిని ఇంత అల్లరిపాలు చేస్తున్నావు. ఇదేనా నీ సున్నితత్వం?"

"రామారావ్! నోటికొచ్చినట్టు మాట్లాడకు. ఎవర్నెలా గౌరవించాలో నువ్వు చెప్పక్కర్లేదు నాకు. ఆ ఉత్తరంలో నిజమెంతో, అబద్ధమెంతో అంతా తెలుసు నాకు" అని చాలా నిర్లక్ష్యంగా చూశాడు — "నా కవితని వీణమీద వాయించిందట! తనకు వీణ వాయించడం వచ్చని చెప్పటం కాదూ?" అన్నాడు వెటకారంగా.

"ఏం చెప్తే?" అని విస్తుబోయాడు రామారావు.

"నన్ను ఆకర్షించాలని ఎత్తు. నేను నడిచిన మెట్టు మెట్టునీ ముద్దెట్టుకోబుద్దేసిందట. పిచ్చెత్తిందేమో! నాలుగు కల్లిబొల్లి మాటలు రాసేస్తే నమ్మేస్తాననుకుంది. ఏ కవిత్వాలనించో కొట్టేసిన ఎంగిలి మాటలు! ముప్పై పైసల కవరుతో లక్ష రూపాయల మొగుడు అప్పనంగా వస్తాడని ఆశ పాపం! పెళ్ళి సంబంధాల కోసం అమ్మాయిలు ప్రేమలు నటించటం అందరికీ తెలిసిందే."

రామారావు నిర్ఘాంతపోతూ తెల్లమొహం వేసి నిలబడ్డాడు. 'ఛీ! వీడితో మాటలేమిట'ని గిరుక్కున వెనక్కి తిరగాలనిపించింది. కానీ అతనితో వాదించి, తర్కించి పోట్లాడాలనే పట్టుదలతో అలాగే నిలబడి "నువ్వు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి?" అన్నాడు మండిపడిపోతూ.

"ఏం, నేనిప్పుడేం కానిమాటలన్నాను?" అని సుధాకర్ చెక్కుచెదరని శాంతంతో చూశాడు.

"ఆ ఉత్తరం నేను తిరిగి నీ కిచ్చినప్పుడు నువ్వేమన్నావు? 'ఎంత అదృష్టవంతుడివో అంటావనుకున్నానే!' అనలేదూ? అంత అదృష్టంగా కనపడ్డ విషయం ఇంత చులకనైపోయిందేం ఇప్పుడు?"

"నువ్వేమంటావో చూడాలని అన్నాను గానీ, ఆఫ్టాల్, సుశీల లాంటిది నన్ను కోరిందంటే అదృష్ట

మేమిటి? చాలా సామాన్యమైన విషయం అది నాకు. నేను 'ఊఁ' అనాలేగానీ లక్షమంది అమ్మాయిలు వాలతారు నా కాళ్ళమీద. వాళ్ళు కోరితే సరిపోతుందా? నేను కోరక్కర్లేదూ? సుశీల కన్నా అందగత్తెని ఎప్పుడో సెలక్టు చేసుకున్నాను నేను."

"అయితే ఆ మాటే చెప్పేసి ఆ అమ్మాయి ఉత్తరం ఆ అమ్మాయికి పంపించేస్తే ఎంత మర్యాదగా వుండేది!"

"మర్యాదగా ప్రవర్తించిన వాళ్ళతో మర్యాదగానే ప్రవర్తిస్తాం."

"అంటే? ప్రేమలేఖ రాయడం మర్యాదలేని పనా?"

"అంత బరి తెగించి గోలపెట్టడం మాత్రం మర్యాదలేని పనే. ప్రేమ, స్త్రీ హృదయంలో గుప్తంగా వుండాలి. అప్పుడే దానికి అందం. సిగ్గు విడిచిన ఆడదాన్ని ఏ మొగాడూ చేరనివ్వడు. నాలాంటి కవి అసలే కన్నెత్తి చూడడు. నాకు కాబోయే భార్య ఫోటో చూస్తావా? పల్లెటూళ్ళో పెరిగిన పిల్ల. ఎంత అమాయక మైన కళ్ళో! ఎంత ముగ్ధ మనోహర రూపమో చూస్తావా?" అంటూ సుధాకర్, చేతిలో పత్రిక అవతల పెట్టి లేచి డ్రాయరు తీశాడు.

అతను కావాలనే అంత గర్వంగా మాట్లాడి, అంత గర్వంగా ప్రవర్తిస్తున్నాడని గ్రహించిన రామారావు తన కోపాన్నీ, ఆవేశాన్నీ ఆపుకోడానికి ప్రయత్నించలేదు. "ఒకమ్మాయి ప్రేమలేఖ రాయడం బరితెగించడంలా కనపడింది నీకు! నీ కోసం సిద్ధంగా వున్నాను, ఎప్పుడు రమ్మంటావు?' అని అడుగుతున్నట్టు కనపడింది. ఆహా! ప్రేమ కవిత్వంతో పత్రికలన్నీ ముంచెత్తే ప్రేమ కవివి కదా మరి! అందుకే ప్రేమ హృదయాన్ని ఇంత గొప్పగా అర్థం చేసుకున్నావు. ఇప్పుడర్థమౌతోంది నీ కవిత్వ రహస్యం. హృదయంలో స్పందన లేకండా డిక్షనరీలు వెతికి పదాలు పోగేసి గారడీ కవిత్వం రాసేవాడికి నిజమైన హృదయాను భూతులెలా అర్థమౌతాయి? ఆ ఉత్తరంలో రాసిన మాటలన్నీ కల్లి బొల్లి కబుర్లలాగా, నిన్ను ఆకర్షించడానికి వేసిన ఎత్తుల్లాగా కనపడ్డాయి నీకు. ప్రేమ కవిత్వం రాసే కవికి జీవితంలో ప్రేమ అంటే మాత్రం ఇంత హేళనా, ఇంత వెక్కిరింతా! ఇంతకాలం నిన్ను ఎంత గుడ్డిగా నమ్మానో! నీ స్నేహం దొరకడమే నా అదృష్టం అను కున్నాను. నువ్వు నా రూమ్‌కి రావడమే నాకు గౌరవం అనుకున్నాను. పాపం సుశీలకి ఘోరమైన అవమానం జరిగితే జరిగింది కానీ, ఇప్పటికైనా నీ అసలు రంగు బయట పడింది!"

రామారావు ధోరణికి సుధాకర్ బిత్తర పోయాడు మొదట! అనుకోని విషయం జరుగుతున్నట్టు తత్తర పడ్డాడు. అంతలోనే తనూ కోపంగా ఎదుర్కొన్నాడు. "నీ రంగూ బయటపడిందిలే. నీ చుప్పనాతి బుద్ధి ఎవడికి తెలీదనుకున్నావు? నా ఉత్తరం చూస్తూ జెలసీతో ఎంత కుళ్ళిపోయావో నేను గ్రహించలేదను కున్నావా? నీ ప్రియురాల్ని నేను దోచుకున్నట్టు అంత ఏడుపు మొహం పెట్టావుగానీ నోరు తెరిచి ఒక్కమాట అన్నావా, సంతోషంగా నాతో? మిగిలిన వాళ్ళందరూ వాళ్ళకెలా తోస్తే అలా కామెంట్ చేశారు గానీ నువ్వు మూతి ముడుచుక్కూర్చున్నావు. అప్పుడే అసహ్యం వేసింది నిన్ను చూస్తే. నేను చాలా సెన్సిటివ్ కాబట్టే నీ కుళ్ళుబుద్ధి చూసికూడా పోనీలెమ్మని వూరుకున్నాను."

"చాలా సెన్సిటివ్ నువ్వు! 'నాకు ప్రేమలేఖ వచ్చిందో' అని ఊరంతా తిరగడంలోనే తెలుస్తోంది నీ సెన్సిటివ్‌నెస్!"

"తిరిగితే తిరుగుతాను. అది నా ఇష్టం. నువ్వు ఎంత ఏడ్చినా లాభంలేదు. మొగాడివైతే నువ్వూ సంపాయించుకో ప్రియురాళ్ళని."

"ఛీ! రాసేది ప్రేమ కవిత్వం. కూసేది బూతు కూతలూ! తగలబెట్టెయ్యి నీ కవిత్వమంతా!" అనేసి ఛీత్కరిస్తూ రామారావు బయటికి వచ్చేశాడు. గది ముందు జేరిన స్టూడెంట్స్ కొందరు తెల్లబోయి చూస్తూ నిలబడ్డారు.

ఒకరిద్దరు స్టూడెంట్స్ నెమ్మదిగా రామారావు గదిలోకొచ్చి "ఏం జరిగింది? సంగతేవిటి?" అని వాకబు చెయ్యబోయారుగానీ రామారావు ఒక్క మాట కూడా చెప్పకుండా "నేనేమీ చెప్పలేను. నాకిష్టం లేదు. ప్లీజ్! నన్ను ఇబ్బంది పెట్టకండి!" అని చెప్పి పంపిం చేశాడు.

సుధాకర్ అంత ఘోరంగా ప్రవర్తించాడంటే

ఇంకా నమ్మశక్యం కాకుండా వుంది రామారావుకి. "ప్రేమ పేరెత్తే అర్హతెక్కడది నీకు? నీ కవిత్వాలన్నీ పట్టుకుపోయి వెయ్యి నిలువుల లోతున పాతిపెట్టు!" అనికూడా అనలేదే అని చాలా పశ్చాత్తాపపడ్డాడు.

★ ★ ★

సుశీల ఉత్తరాన్ని మొదటిసారి చదవగానే సుధాకర్ చాలా తల్లడిల్లాడు. ఆనంద పారవశ్యంలో ఓలలాడాడు. ఒక అమ్మాయి హృదయంలో తనకు అంత స్థానం వుందా అని గర్వపడ్డాడు. తన జన్మంతా అంత ప్రేమ వారాసిలో ఓలలాడడం కన్నా వేరేమీ అక్కర్లేదనుకున్నాడు. అతని సహజ లోకజ్ఞానాన్ని మరుగుపరచిన ఆ నాలుగు క్షణాలూ కరిగిపోగానే అతని ఆస్తి బానిసత్వం, తండ్రి బానిసత్వం, అతన్ని మళ్ళీ వాస్తవ జగత్తుకి తెచ్చాయి. తండ్రి కుదిర్చే సంబంధంతో తనకు సంక్రమించబోయే ఆస్తి కాంతి — సూర్యకాంతి లాగా మెరిసి, చీకట్లని పారదోలింది.

కొన్నిక్షణాలు తీవ్రమైన ఊగిసలాటలో కొట్టు కున్నాడు — కవిగనకే. తండ్రి కుదుర్చుతున్న సంబంధాన్ని తను కాదనుకుంటే గెంటెయ్యగలడు. కానీ, దానితోపాటు అస్తీ, ధనికుడైన మామా, దొరకబోయే పెద్ద ఉద్యోగం, భవిష్యత్ మార్గం అంతా నున్నని తారురోడ్డే — ఆ అమ్మాయి తన కవితా సౌందర్యాన్ని ఆస్వాదించగలదా — అన్న సంకోచం ఒక్కటితప్ప!

సుశీల ఉత్తరం కొన్ని క్షణాలు అతన్ని తుఫానులో చెట్టుని ఊపేసినట్టు ఊపేసి మోడుచేసింది. తనని సుశీల కోరుతున్నట్టుగా ఆ వ్యక్తి కోరడం లేదు. తను కూడా ఏ మూలో కాస్త నిజంగా వున్న రసహృదయంతో సుశీలలాంటి ప్రియురాల్ని కోరుతున్నట్టుగా ఆ వ్యక్తిని కోరడం లేదు. కానీ సుశీల లక్షలు చేసే ప్రేమ ఇవ్వగలదేమో గానీ, 'లక్షలు' ఇవ్వలేదు కదా?

క్షణికమైన మనస్సంఘర్షణలో పచ్చపచ్చని ఊహలన్నీ రాలి మోడైంది హృదయం.

అతను ప్రేమవేపే వొంగాడు — కానీ, ఆస్తి మీద ప్రేమవేపు! ఆస్తిమీద ప్రేమని వొదులుకునే తెగువ తనకు లేదని గ్రహించుకున్న క్షణంలోనే సుశీల ప్రేమ మీద చిన్నచూపు ప్రారంభమైంది. ఆ ప్రేమలో ఏదో లోపంకోసం, అపరాధం కోసం, అతని మనసు అన్వేషించింది. ఆ ప్రేమ లేఖంతా వెతికి వెతికి చివరికి కనిపెట్టాడు. అది తనని ఆకర్షించే యెత్తనీ, ప్రేమ లేఖని ఎరబెట్టి మొగుణ్ణి సంపాయించే ప్రయత్నమనీ, స్త్రీ హృదయంలో ప్రేమ గుంభనగా వుండాలి గానీ అంత బట్టబయలు కారాదనీ! తన సూత్రీకరణలతో సుశీల ప్రేమ వట్టి బూటకమని నిర్ణయించుకున్న తర్వాతే ఆ యువ కవికి ఆత్మ శాంతించింది.

ఆ ప్రేమ లేఖని లోకంలో ప్రదర్శించడం తనకు కీర్తేనని గ్రహించాడు గనక ఆ కీర్తికూడా సాధించదలిచాడు. దానితోపాటు తన నిర్ణయాన్ని తన మిత్రులంతా సమర్థిస్తారని ఆశించాడు.

అతననుకున్నట్టే మోహన్‌రావు ఆ ఉత్తరం చూసి — "ఇదేం తలనెప్పోయ్ నీకూ! సుశీలంటే ఆ పొడుగ్గా నల్లగా వుంటుంది, ఆ అమ్మాయేగా? చాలాసార్లు చూశాలే. విద్యానగర్ అనుకుంటా వాళ్ళుండేది. వాళ్ళ నాన్నకేం ఉద్యోగం? వాళ్ళింట్లో ఊరుకుంటారా ఇలాంటి ఉత్తరాలు రాస్తే? ఇంట్లో తెలిసేట్టు రాస్తా రేవిట్లే. దండగ లెద్దూ ఇలాంటి వ్యవహారం నీకు...." అనేశాడు గబగబా.

అతని మాటలన్నీ సుధాకర్‌కి వీణ స్వరాలలాగా వినపడ్డాయి. మోహన్‌రావు తన క్షేమంకోరే మిత్రుడని పూర్వం కన్నా బాగా అర్థం చేసుకున్నాడు.

ఆ ఉత్తరం చూసి కృష్ణారావు కూడా అలాగే అన్నాడు — "మీ పెద్దవాళ్ళు వొప్పుకుంటే ఫర్వాలేదేమో!.... అన్నట్టు వీళ్ళేం కులం? మీ నాన్నగారు ఒప్పుకుంటారా?" అని నాన్నగారి భావాల సేకరణలోకి దిగాడు.

"భలే ఛాన్సు కొట్టేశావోయ్. ఇంకేం? ఇవ్వాళే సినిమాకి తీసుకుపో" అని అభినందించాడు ఇంకో ఫ్రెండ్ సుధాకర్‌ని.

ఆ ఉత్తరం చూసిన ఐదారుగురిలోనూ రామారావు ఒక్కడే ఒక్కమాటకూడా మాట్లాడలేదు. మెత్తగా నవ్వి ఊరుకున్నాడు. సుధాకర్ రెట్టించినా కూడా జవాబు చెప్పకండా నవ్వి ఊరుకున్నాడు.

ఆ ప్రేమ లేఖని మోహన్‌రావుకీ, కృష్ణారావుకీ, రవికుమార్‌కీ, ఇంకా అలాంటి వాళ్ళకీ గాక రామారావు

లాంటి వాడికి కూడా చూపించడమే సుధాకర్ చేసిన పొరపాటంతా.

రామారావు అర్ధరాత్రిదాకా ఆలోచించి, ఆలోచించి, జరిగిందంతా సుశీలకు చెప్పెయ్యాలనే నిశ్చయానికొచ్చాడు. లేకపోతే తనూ అతనిలాగే దుర్మార్గుణ్ణవుతానని భయపడ్డాడు.

★ ★ ★

తను ఉత్తరం రాసిన మూడోరోజు సుశీల కాలేజీకి వెళ్ళడం మానేసింది.

ఆ రోజు సుధాకర్ దగ్గర్నించి తప్పకుండా జవాబు వొస్తుందని ఎదురు చూస్తూ ఇంటిదగ్గిరే కూర్చుంది. గేటు తీసుకుని వాకిట్లోకి వస్తోన్న పోస్టుమేన్ సాక్షాత్తూ దేవదూతలాగే కనిపించాడు. సుశీలకో కవరు కూడా ఇచ్చాడు. సుధాకర్‌కి ఇచ్చిన పద్ధతిలోనే రాసివుంది. ఎడ్రస్. సంతోషంతో మూర్ఛ పోతాననుకుంది సుశీల.

కవరు చించి ఉత్తరం తీసి గబగబా చదవడం మొదలుపెట్టి తుళ్ళిపడింది. మొహం చిట్లించింది. ఆశ్చర్యపడింది. ఉత్తరం అంతా చూస్తే చాలా కోపం వచ్చింది. అది సుధాకర్ రాసిన జవాబు కాదు. ఎవరు రాశారో సంతకం వివరంగా తెలీడం లేదు. అతి ప్రయత్నం మీద చదివితే "మోహన్" అయివుండొచ్చనిపించింది. ఉత్తరం అంతా వెకిలి మాటలతో, పిచ్చి పిచ్చిగా వుంది. 'ప్రేయసీ!' అని ఉత్తరం మొదట్లోనే ఒక చెత్త కూత కూశాడు, "నీ హృదయం అన్యులకే గానీ నాకు దక్కదా? నీ హృదయం మీద పడి ముద్దాడాలనీ, నిద్రించాలనీ నా హృదయం కలవరిస్తోంది ప్రేయసీ.... నీకు దక్కని వాడికోసం ఎందుకు అశ్రులు చాస్తావు? మిగిలిన వాళ్ళెవరూ నీకు పనికిరారా? .... నీ శయ్యపై నాకు చోటు లేదా?"

సుశీల రెండు మూడుసార్లు అక్కడక్కడా చూసి కోపంతో ఉత్తరం చింపేసింది. మొహమంతా జేవురించి, కోపంతో వొణుకుతూ కూర్చుంది ఆలోచనల్లో మునిగి. సుధాకర్‌కి ఉత్తరం రాసిన సంగతి ఇతనికెలా తెలిసింది? ఆ ఉత్తరం చూశాడా ఇతను? ఎలా చూస్తాడు? సుధాకర్ ఏ బల్లమీదైనా పెట్టాడా? అతను రూమ్‌లో లేని సమయంలో ఇతను వొచ్చి ఉత్తరం తీశాడా? — ఆలోచిస్తోన్న కొద్దీ ఆ చెత్త ఉత్తరం ఒక గొప్ప సంతోషవార్తని మోసుకొచ్చిందన్న సంగతి అర్థమైంది. తన ఉత్తరం సుధాకర్‌కి చేరిందన్నదే ఆ సంతోష వార్త. తన ఉత్తరం ఆయనకు చేరింది. అంతేచాలు. ఎక్కడో జాగ్రత్త పరిచే వుంటాడు. ఈ దుష్టుడు ఆయనకు తెలీకుండా దాన్ని చూసి ఆ ఎడ్రెస్ సంగ్రహించి వుంటాడు! అలా అనుకుంటే సుశీల మనసెంతో తేలిక పడింది.

ఆతృత తగ్గి మధ్యాహ్నం కాలేజీకి బయల్దేరింది. బస్‌స్టాప్‌లో దిగి కాలేజీవేపు నడుస్తోంటే కేంటీన్ లోంచి హడావిడిగా వస్తూ ఒక స్టూడెంట్ సుశీలతో పాటు నడవడం మొదలెట్టాడు.

"మీరిప్పుడే వస్తున్నారా?" అన్నాడు.

సుశీల కొంచెం ఆశ్చర్యపడి "అవునండీ" అంది.

"మీ పేరు సుశీల కదూ? తెలుసులెండి అవునో కాదో అని అడిగాను" అన్నాడు.

"అవును" అంది సుశీల ముభావంగా.

"మీకు కవిత్వం అంటే చాలా ఇష్టం కదండీ?" అన్నాడు.

సుశీల మాట్లాడలేదు.

"నేనూ కవిత్వం రాస్తానండీ. కొన్ని కవితలు కూడా పత్రికల్లో పడ్డాయి" అన్నాడు.

"నేనూ అంటే?" అంది.

"అదే మీ క్లాస్‌మేట్ సుధాకర్ గారు మంచి కవిత్వం రాస్తారు కదండీ? మీకు తెలిసే వుంటుంది. మీకు కవిత్వం అంటే చాలా ఇష్టమని ఎవరో అన్నారు. నేనీమధ్యనే నాలుగైదు కవితలు రాశాను. ఫ్రెండ్సంతా చదివి చాలా బాగున్నాయన్నారు. ప్లీజ్! మీరు కూడా చూస్తారా శ్రమ అనుకోకపోతే" అంటూ పుస్తకాల మధ్యనించి ఒక నోట్‌బుక్ తీసి ఇవ్వబోయాడు.

సుశీల అతని ప్రవర్తనకి చాలా ఆశ్చర్యపడుతూ "నాకేం తెలీదు కవిత్వం గురించి. కావాలంటే సుధాకర్‌గారికి చూపించండి. ఆయనైతే ఏమైనా సలహాలివీ ఇవ్వగలరు" అంది.

"ఆయనకీ చూపిస్తాననుకోండీ! మీరు కూడా చూస్తే.... చాలామంది అభిప్రాయాలు సేకరిస్తున్నానండీ" అంటూ నోట్ బుక్ సుశీల మొహం దగ్గిరికి

తెచ్చి సుశీల చేతిలో పుస్తకాలమీద పెట్టెయ్యబోయాడు.

ఆ నోట్ బుక్ మీదనించి ఒక రకం సెంట్ వాసన కొట్టింది సుశీల మొహానికి. ముక్కూ మొహం ఎరగని వ్యక్తి అంత మోటుతనంగా ఆ నోట్ బుక్కు తన పుస్తకాలమీద పెడుతోంటే సుశీలకి చెప్పలేనంత కోపం వచ్చింది. "మీరిలా చెయ్యడం బాగాలేదు. నా కిష్టంలేదు. తీసేసుకోండి" అంటూ అతని పుస్తకం అతని కిచ్చేసి తన దారిన తను వచ్చేసింది.

ఆ పూట క్లాసులో సుధాకర్ లేడు.

సుశీల మనసంతా గందరగోళంగా అయింది.

'నేనూ కవిత్వం రాస్తానండీ' అనడం, తనని కవిత్వం చదవమని బలవంతపెట్టడం, తనకు కవిత్వం ఇష్టమని ఎవరో అన్నారనడం — అంతా అయోమయంగా అనిపించింది. కేవలం కవిత్వం మీద అభిప్రాయం తెలుసుకునే ధోరణితో అడిగినట్టు లేదు. అయినా తన అభిప్రాయం ఎందుకు? తనేమన్నా కవిత్వం రాసే మనిషా?

సుధాకర్‌కి రాసిన ఉత్తరం సంగతి ఇతనికి కూడా తెలిసిందా? ఎలా తెలుస్తుంది? సుధాకర్ చూపించాడేమో! — ఛీ! ఏమిటీ ఆలోచనలు? సుధాకర్ చూపిస్తాడా? ఎందుకు చూపిస్తాడు? లేకపోతే ఎలా తెలుస్తుంది వేరే వాళ్ళకి? ఆయన జేబులోంచి ఆ ఉత్తరం ఎక్కడైనా పడిపోతే వీళ్ళెవరైనా చూశారేమో! లేకపోతే ఆ మోహన్ అనే అతనే సుధాకర్ రూమ్‌లో ఉత్తరం చూసి ఇతనికి కూడా చెప్పాడేమో! — ఏదో జరిగే వుండాలి. ఆ సంగతి బైటపడబట్టే వీళ్ళిలా ప్రవర్తిస్తున్నారు. తను ఇష్టపడుతుందేమోనని వెకిలి ప్రయత్నాలు చేస్తున్నారు. సుధాకర్, అంత అజాగ్రత్తగా పెట్టుకున్నాడా తన ఉత్తరం? — సుశీలకి పిచ్చెత్తినట్టుగా వుంది ఆలోచనల్తో. రమణి కూడా రాలేదు ఎందుకో. కాస్త మాటల్లో పడి ఇదంతా మరిచిపోతే బాగుండేది.

రెండు పిరియడ్లు ఎలాగో గడిచాయి, లాస్టవరు ఖాళీ. అందరూ లేచి గబగబా పరిగెత్తారు. సుశీల కూడా లేచి వెళ్ళబోతోంటే రెండు బెంచీల అవతల నించి రామారావు "సుశీలగారూ!" అని పిలుస్తూ దగ్గరికి వచ్చాడు.

"మీతో కొంచెం మాట్లాడాలండీ!" అన్నాడు.

సుశీల ఆశ్చర్యపడుతూ — "ఏమిటి?" అంది.

రామారావు ఎలా చెప్పాలో తోచక తికమక పడ్డాడు.

"చెప్పండి" అంది పుస్తకాలు బెంచీమీద పెట్టి.

"ఇక్కడ కాదు. గార్డెన్‌లో ఎక్కడైనా కూర్చుంటే బాగుంటుంది."

"అసలు సంగతేమిటో చెప్పండి!"

"సుధాకర్ గురించి కొంచెం మాట్లాడాలి మీతో."

సుశీల ఆతృత అణుచుకుంటూ "సుధాకర్ గారేమన్నా నాతో చెప్పమన్నారా?" అంది కళ్ళువాల్చి.

"అదికాదు. నేనే మీకు చెప్పాలను కుంటున్నాను."

"సుధాకర్ గురించి నాకు చెప్పడం ఎందుకూ?" అని కొంచెం కోపంగా చూసింది.

"ప్లీజ్! నన్నర్థం చేసుకోండి! మీరు సుధాకర్‌కి ఉత్తరం రాసిన సంగతి నాకు తెలుసు. మీ విషయంలో అతను చాలా అసహ్యంగా ప్రవర్తిస్తున్నాడు. మీ ఉత్తరం అందరికీ చూపిస్తున్నాడు. నాక్కూడా చూపించాడు."

సుశీల తన చెవులకేం మాటలు వినపడ్డాయో గ్రహించనట్టుగా, ఆ మాటలు అర్థం కానట్టుగా చూసింది. తెల్లబోతూ చూసింది. నమ్మకం లేనట్టు చూసింది. నిర్ఘాంతపోతూ చూసింది. కొయ్యబారిన మనిషిలాగా అలాగే నిలబడి పోయింది.

రామారావుకి భయం వేసింది — ఆ అమ్మాయి అలాగే నిలబడి ప్రాణాలు విడిచేస్తుందేమోనని! "ప్లీజ్ సుశీలా! ఎక్స్యూజ్ మీ. ఏక్స్యూజ్ మీ...." అంటూ ప్రాధేయపడ్డాడు.

సుశీల నిలబడలేక పోతున్నట్టు బెంచీ మీద కూర్చుంది. డెస్క్ మీదకి తల వొంచేసుకుంది.

రామారావుకి చాలా తప్పు చేశానేమో ననిపించింది. చాలా కఠినంగా ప్రవర్తించానేమో ననిపించింది. సుశీలని పలకరించాలంటే భయం వేసింది.

ఇంకా జాగ్రత్తగా చెప్పాల్సింది. అంత తొందర పడకుండా చెప్పాల్సింది — అని నొచ్చుకుంటూ

నించున్నాడు.

కొంతసేపటికి సుశీల లేచి పుస్తకాలు పట్టుకుంది.

"మీ కెలా చెప్పాలో తెలీలేదండీ. మీకు చాలా బాధ కలిగించాను. నన్ను క్షమించండీ" అని మళ్ళీ ప్రాధేయ పడ్డాడు.

"పదండి వెళ్దాం" అంది సుశీల గుమ్మం వేపు నడుస్తూ.

ఇద్దరూ గార్డెన్‌లో కూర్చున్నారు. గార్డెన్‌లో చాలా దూరంగా అక్కడక్కడా నలుగురైదుగురు స్టూడెంట్స్ మాత్రం వున్నారు.

కూర్చున్న తర్వాత కూడా రామారావు వెంటనే ప్రారంభించలేక పోయాడు. సుశీలకు నమ్మకం కలిగేలాగ చెప్పాలని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"చెప్పండి" అంది సుశీల చాలా దిగాలు పడుతూ.

"మీకెలా చెప్పాలో...."

"ఎలా జరిగితే అలా చెప్పండి!" అంది తల వాలేసి.

"ఎలా జరిగిందో వింటే మీకు చాలా బాధ కలుగుతుంది. అసలు మీకీ విషయం చెప్పాలా వద్దా అని నేను చాలా ఆలోచించాను. చాలా విధాల ఆలోచించాకే మీకు తప్పకుండా చెప్పాలని నిర్ణయించుకున్నాను" అని ప్రారంభించాడు. సుధాకర్ తన గదిలోకి రావడం, తనకో ఉత్తరం చూపించి చదవమనడం, తను చదవడానికి సంకోచిస్తోంటే తనని వొత్తిడి చేయడం, అన్నీ చెప్పుకొచ్చాడు.

సుధాకర్ ప్రవర్తన గురించి తెలుస్తోన్న కొద్దీ కుంగిపోయింది సుశీల. సుధాకర్ తన ఉత్తరం గురించి ఇతరులకు చెప్పేశాడనడానికి సాక్ష్యం దాని సంగతి బయటికి తెలియడమే. సుధాకర్ ప్రమేయం లేకండా అది ఎలాగో బైటపడిందని ఇంకా ఎలా నమ్ముతుంది? అది తనని తను వంచించుకోవడమే కదా?

రామారావు మాటలు వింటూ సుశీల తన విచారాన్నీ, కోపాన్నీ ఆపుకోలేకపోయింది. "నిజంగా అన్నాడా ఆ మాటలు?" అని నాలుగైదుసార్లు మధ్య మధ్య అడిగింది.

"అతన్ని ఆకర్షించడానికే ఆ ఉత్తరం రాసినట్టను కున్నాడతను. ఆడపిల్లలు పెళ్ళి సంబంధాల కోసమే ఇలాంటి ప్రేమలు నటిస్తారన్నాడు" అని రామారావు చాలా సంకోచపడుతూ చెప్తే, సుశీల కత్తిదెబ్బ తగిలినట్టు చూసింది. ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "నిజంగా అన్నాడా?" అని అడిగింది.

"అయ్యో! నన్ను నమ్మండి! మీతో అబద్ధం చెప్పవలసిన అవసరం నాకేముంది? సుధాకర్ ప్రవర్తనకి నేను ఇప్పటికీ షాక్ అవుతున్నాను. ఇక మీరెంత అవ్వాలో! పరిస్థితిని కొంచెం జీర్ణించుకోడానికైనా అవకాశం లేకుండా విషయాలన్నీ ఒకదానివెనక ఒకటి గబగబా జరిగాయి. 'ఇదంతా జరిగిందా' అని నాకు ఇప్పటికీ సందేహంగానే వుంది. మీరు అతనికి ఉత్తరం రాసినందుకు నేను జెలసీగా ఫీలయ్యానని నా మీద కూడా పెద్ద అభాండం వేశాడు. ఎందుకలా అనుకున్నాడో నాకిప్పటికీ అర్థం కావడం లేదు. 'నీకు పెళ్ళి సెటిలైపోతే ఆ మాటే చెప్పేస్తూ ఆ అమ్మాయి ఉత్తరం ఆ అమ్మాయికి పంపించేస్తే బాగుండేది కదా' అని నే నడిగానని, ఇక అవాకులూ చెవాకులూ వాగడం మొదలెట్టాడు..."

సుశీల చెంపలు తుడుచుకుంటూ — "అతనలా చేస్తే ఎంత బాగుండేది!" అంది నెమ్మదిగా.

"ఎంత సామాన్యుడైనా అలాగే చేస్తాడు. ఇతను సామాన్యుడి కన్నా హీనుడిగా వున్నాడనుకోవాలి. ప్రేమ ఆడవాళ్ళ మనసులో గుంభనగా వుండాలి గానీ, ఇలా బట్టబయలు కాకూడదట..."

"అంటే?"

"ఏమో, అతనేమంటున్నాడో నాకూ అర్థం కాలేదు. 'ప్రేమ లేఖ రాయడం తప్పా?' అని అడిగాను. ఏదో వాగాడు. చెప్పడానికి నాకే సిగ్గుగా వుంది. అతని గురించి ఈ విషయాలన్నీ మీకు తెలీకపోతే, అతను మీతో ఏం నాటకం ఆడతాడో, మీరేం చిక్కుల్లో పడతారో అని మీకు చెపుతున్నానుగానీ... నన్ను నమ్ముతున్నారా నిజంగా? లేకపోతే నేను సుధాకర్ మీద చాడీలు చెపుతున్నాననుకుంటున్నారా?"

"నేనలా అనుకోడం లేదండీ. మీరు చెప్పేదంతా

నిజమేననుకుంటున్నాను."

ఆ ఉత్తరం రాసిన తరవాత సుశీలకి సుధాకర్ రెండుసార్లు కనపడ్డాడు. ఒకసారి క్లాసులో కనబడ్డాడు. ఒకసారి లైబ్రరీకి వెళ్తోంటే కనబడ్డాడు. అక్కడ అతను ఎవరితోనో మాట్లాడుతూ నించున్నవాడల్లా దూరంగా సుశీలని చూడగానే పక్కనే రాతిమీద కాలుపెట్టి, సిగరెట్ కాలుస్తూ, ఏదో పోజు ఇచ్చినట్టు నిలబడ్డాడు. సుశీలకు మనసు చివుక్కుమనిపించింది. అతనలా నించోవడంలో ఏదో లెక్కలేనితనం, లక్ష్యంలేనితనం .... అలాంటి ఏదో భావంతో అతడు ప్రవర్తించి నట్టని పించింది. 'అలా ప్రవర్తించా డేమిటి, అలా ప్రవర్తించా డేమిటి, అలా ప్రవర్తించాడేమిటి' అని సుశీల గుండె అప్పటి నించీ, ఒక అపశృతితో కొట్టుకుంటూనే వుంది. చాలాసార్లు దాన్ని మరిచిపోయినా ఎక్కడో గుర్తు వుంటూనే వుంది.

రామారావు మాటలు వింటోంటే సుశీలకి తనా ఉత్తరం రాయడం ఎంత పొరపాటైందో అర్థమౌతోంది. 'ఎంత తొందరపడ్డాను, ఎంత తొందరపడ్డాను' అనే ఘోష ప్రారంభమైంది మనసులో.

"రామారావుగారూ! ఒక్కమాట చెప్పండి. అతన్ని ఆకర్షించడానికే నేనా ఉత్తరం రాశాననుకున్నారా మీరు కూడా?"

"ఎందుకలా ఫీలవుతారు? నేనూ అలాగే అను కున్న వాణ్ణయితే అతని గుంపులోనే చేరేవాణ్ణి కదా? ఈ సంగతులన్నీ మీకెందుకు చెపుతాను?" అని రామారావు అనగానే సుశీలకు చాలా నమ్మకం కలిగింది.

రామారావు చాలా సీరియస్‌గా చర్చిస్తున్నట్టు అన్నాడు. "నేను ఒక రకంగానూ, మీరింకో రకంగానూ ఇద్దరం పొరపాటు చేశామనిపిస్తోంది. అతని కవిత్వం మాత్రమే చూసి అతనితో స్నేహమో, ఇంకోటో కావాలనుకోవడం పొరపాటు కాదూ? పాడగలిగేవాళ్ళు పాడతారు. ఆడగలిగే వాళ్ళు ఆడతారు. రాయగలిగే వాళ్ళు రాస్తారు. వాళ్ళలో వుండే కళాత్మకశక్తిని మాత్రం చూసి దానివల్ల వాళ్ళు స్నేహితులుగానో ప్రేమికులు గానో పనికి వస్తారనుకోవడం చాలా పొరపాటేనండీ?

ఒక కవి ఆరోగ్యవంతుడో కాదో చూడాలంటే, డాక్టరు అతని కవిత్వం చూస్తాడా? అతని నాడి చూస్తాడు, గుండె చూస్తాడు, ఊపిరితిత్తులు చూస్తాడు. అలాగే, ఒక కవి మంచి మనిషో కాడో, మంచి స్నేహితుడిగా ఉండగలడో లేదో చూడాలంటే, అతని వ్యక్తిగత జీవితం చూడాలి. అతని సంభాషణలు వినాలి. అతని ప్రవర్తన గమనించాలి. అంతేగానీ పుస్తకాల్లో రాసేదీ, వేదికలెక్కి మాట్లాడేదీ చూసి అదంతా నమ్మడం, వాళ్ళు గొప్ప వాళ్ళనుకోడం, చాలా తెలివితక్కువ కాదూ?"

"రాసిన దాన్ని బట్టి రాసిన వాళ్ళ భావాలు తెలుస్తాయి కదా!" అంది సుశీల చాలా అనాసక్తిగానూ, నిరుత్సాహంగానూ.

"భావాలకేంలెండి, ఏ భావాలవల్ల కీర్తి వస్తుం దంటే ఆ భావాలు తమకు వున్నట్టు రాయొచ్చు. వాళ్ళు చాలా గొప్ప భావాలు గల వాళ్ళలాగా కన పడొచ్చు!"

"అలాంటి వాళ్ళని తెలుసుకోలేమా?"

"ఏం తెలుసుకున్నాం ఇప్పుడు? ఏమైంది ఇతని విషయంలో? ప్రేమ గురించి అతను ఎంతెంత గొప్పలు రాశాడు! ప్రేమ గురించి సుధాకర్ ఇంత నీచంగా మాట్లాడగలడని నేనైతే కలలో కూడా అనుకోలేదు. ప్రేయసి కోసం ఆకాశాలు వెతికేవాడు పాతాళానికి జారి డబ్బుకి అమ్ముడుపోతాడని అను కున్నామా? ఆ కవిత రాసినప్పుడైతే చాలా సిన్సియర్‌గా వున్నాడుగానీ తర్వాతే మారిపోయాడంటారా? నేనలా అనుకోను. అప్పుడూ దొంగే, ఇప్పుడూ దొంగే అతను. మనకి అనుభవాల్లేక అర్థం చేసుకోలేకపోయాం. మన కన్నా తెలిసిన వాళ్ళైతే ఆ కవితలోనే అతని స్వభావాన్ని కనిపెట్టేసే వాళ్ళేమో!"

సుశీల చాలాసేపు మౌనంగా కూర్చుంది. "మనిషితో కనీసం పరిచయమైనా లేకుండా చాలా దూరంపోయాను" — ఆ రెండు మాటలూ అనడంతో ఆమె కన్నీళ్ళు జలజలా రాలి, కంఠం మూసుకుపోయి మాట్లాడలేకపోయింది.

"ఒక రకంగా అంతేనండీ. వ్యక్తిగత పరిచయం లేకండా ప్రేమ ఏమిటి? తెర వెనకనించో, తలుపు సందుల్లోంచో చూసి, మోహించి, అతనెలాంటి వాడైనా

అతన్నే పెళ్ళాడి, కాపరాలు చేసే రోజుల్లో అయితే అలాంటి ప్రేమలుగానీ, ఈ రోజుల్లో ఒకరి సంగతి ఒకరికి తెలీకుండా ప్రేమలేమిటి? మీకిష్టంలేని విష యాన్ని కూడా పట్టించుకోకుండా ప్రేమించడం అంటే, అది గుడ్డి ప్రేమ కాదూ? లోపాలు చూడకుండా సర్దుకుపోయే వాళ్ళు ఔన్నత్యాలు మాత్రం చూడ గలుగుతారా?

సుధాకర్ అంగీకరించాడే అనుకోండి. అతనికి మీ గురించి తెలిసి, మీ భావాలు తెలిసి, మీ ప్రవర్తన తెలిసి, మీ వ్యక్తిత్వం తెలిసి, వాటన్నిటినీ ఇష్టపడి కోరి అంగీకరించి నట్టవుతుందా? 'ఫలానా రోజు స్టేషన్‌కి రమ్మ'ని ఉత్తరం వొస్తే స్టేషన్‌కి వెళ్ళినట్టుగా, 'నాకు ప్రేమ కలిగింద'ని ఉత్తరం వొస్తే ప్రేమించడం సాధ్యమౌతుందా? ఆలోచించండి! ఒకరికొకరు చాలా సన్నిహితంగా తెలిసి ఇష్టాలేర్పడుతూ వున్నప్పుడు, ప్రేమలేఖల ద్వారా మాట్లాడవచ్చుగానీ... ఏమో! ఇలాంటి ప్రేమల మీద ఆధారపడి మనుషుల్ని ఎంచుకుంటే అదంతా సవ్యంగా నడుస్తుందని నాకని పించడం లేదు. సుధాకర్ మీ విషయంలో అంత నీచంగా ప్రవర్తించాడన్నదే నా కంప్లయింట్‌గానీ, అతను మిమ్మల్ని ప్రేమించి తీరాలని నేను అప్పుడు కూడా అనుకోలేదు... 'ప్రేమ' విషయంలో మీరు ఒక తప్పటడుగు వేశారనిపిస్తోంది. దాని ఫలితమే ఇంత అవమానం ఎదుర్కోవలసి వచ్చింది."

రామారావు తనని విమర్శించాడని సుశీలకి బాధ కలగలేదు. అంతకన్నా ముందునించీ తన తెలివి తక్కువ తనానికి తనని తను మందలించుకుంటూనే వుంది. రామారావు మాటలు సుశీలకి చాలా కొత్తగా, చాలా ఆశ్చర్యంగా కనిపించాయి. తను చేసిన తప్పేమిటో మొహంమీద కొట్టినట్టు బోధపడింది.

"నా వల్ల పొరపాటే జరిగిందనుకోండీ. అతను మంచి మనిషిలా ప్రవర్తించి వుండకూడదా? 'నీ మీద నా కలాంటి అభిప్రాయం లేదు' అని చెప్పవచ్చు కదా?"

"అలా ప్రవర్తిస్తే అతను మనం అనుకున్న సుధా కరే అయ్యేవాడు. అతనెలాంటి వాడో గమనించక పోవడం మన తప్పవుతుందిగానీ, మన ఊహల ప్రకారం ప్రవర్తించకపోవడం అతని తప్పెలా అవు తుంది?"

ఎంత మాట్లాడినా మళ్ళీ మళ్ళీ అదే.

ఇద్దరూ లేచారు.

బాధ పడొద్దనో, ధైర్యంగా వుండమనో, అంతా మరిచిపొమ్మనో, చెపుదామనుకున్నాడు రామారావు. జరిగింది మరిచి పొమ్మనడం, బాధ పడొద్దనడం, ఇంకేదో అనడం, ఉత్త కంటి తుడుపు మాటలవు తాయనిపించి ఆ ప్రయత్నం మానుకున్నాడు. బాధ కలగకా మానదు; జరిగిందంతా ప్రతీ క్షణం గుర్తురాకా మానదు. నమ్మిన మనిషి తననంత అవమానం చేశా డన్న కోపమే కలిగితే అతని మీద ప్రేమ నశించడం ఎంతసేపు!

చెట్లకింద ఖాళీ ఆటో కనిపించింది.

"చీకటి పడుతోంది. బస్సు లేట్ కావచ్చు. ఆటోలో వెళ్తారా?" అన్నాడు రామారావు.

సుశీల ఆటో అతన్ని అడిగి ఎక్కి కూర్చుంది.

చీకట్లు అలుముకుంటోన్న కేంపస్ వాతావరణం లాగ సుశీల మొహమంతా ఎంతో విషాదంగా కని పించింది.

★ ★ ★

తర్వాత వారం పది రోజులు సుశీల కాలేజీకి రాలేదు.

రామారావు చాలా ఆందోళనపడ్డాడు. సుశీలని చూడడానికి ఇంటికి వెళ్దామా అని కూడా ఆలో చించాడు. చాలా దిగులు పడుతోందేమోనని విచార పడ్డాడు. ఒకసారి రమణిని కూడా అడిగాడు సుశీల రావడం లేదేమని. "తనకి వొంట్లో బాగా లేదండీ" అంది రమణి.

సుశీల వచ్చిన్నాడు రామారావుకి చాలా సంతోషం కలిగింది. "బాగున్నారా!" అని పలకరించాడు. నవ్వి ఊరుకుంది.

ఆ వారం పది రోజుల్లో కూడా సుశీలకి సుధాకర్ దగ్గర్నించి జవాబు రాలేదు.

క్లాసులైపోయిన తర్వాత, సుశీల, రమణి నోట్ బుక్స్ చూస్తూ ఆమెతో మాట్లాడుతూ కూర్చుంది.

సుధాకర్ సుశీల డెస్కు దగ్గిరికి వచ్చి "సుశీల గారూ! మీతో కొంచెం మాట్లాడాలండీ" అన్నాడు నవ్వుతూ.

బిత్తరపోయింది సుశీల. అతనేమన్నాడో కూడా సరిగా వినలేదు. ఆ రోజు క్లాసులో సుధాకర్ వున్నాడా లేడా — అని ఆమె చూడలేదు. చూడాలని ఒక్కసారి కూడా అనిపించలేదు. సుధాకర్ తన దగ్గిరికి వచ్చి మాట్లాడతాడని అనుకోకపోవడంవల్ల కొంచెం కంగారుపడి సర్దుకొంది.

రమణి తన పుస్తకాలు తీసుకుని "నేనూ శకుంతలా బస్‌స్టాప్ దగ్గిర వుంటాం. తొందరగా వచ్చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయింది.

సుశీల కూడా పుస్తకాలు డెస్కులోంచి తీస్తూ "ఏమిటో చెప్పండి" అంది పుస్తకాల వేపు చూస్తూ.

"అలా కొంచెం సేపు గార్డెన్ వేపు వెళ్దాం, వస్తారా?" అన్నాడు సుధాకర్ నవ్వు మొహంతో.

"నాకంత టైమ్ లేదు. సంగతేమిటో చెప్పండి!" అని పుస్తకాలు సర్దుతూ నించుంది.

తను తొందరగా జవాబివ్వనందుకే అలక సాగిస్తోందనుకున్నాడు. "ఇలాంటి వ్యవహారాల్లో కాయితాల మీద కమిట్ కాకూడద"ని ఒక మిత్రుడు ఇచ్చిన సలహా ప్రకారం, సుశీలకు జవాబు రాయకుండా, ఆమె రాకకోసం ఎదురుచూస్తున్నాడు సుధాకర్ ప్రతిరోజూ. తన పెళ్ళి సంగతి ఆమెతో ప్రస్తావించకుండా వ్యవహారం ఎలా నడిస్తే అలా నడపాలనుకుంటున్నాడు.

"మీరు చాలా రోజులు కాలేజీకి రాలేదే? ఆరోగ్యం బాగా లేదా?"

"అదేం కాదులెండి. మీరేదో మాట్లాడాలన్నారు, చెప్పండి."

"అంత కోపంగా వున్నారేం? జవాబు రాయలేదనా? మీ లెటర్ అందిన తర్వాత చాలా బిజీ పనులవల్ల జవాబు రాయలేకపోయాను."

"ఫర్వాలేదు."

సుధాకర్ ఆమె ముందు డెస్కుమీద చెయ్యి ఆన్చి, చాలా చొరవగా, ఆమె హృదయాధిపత్యం తనదే అయినట్టు నవ్వుతూ — "నా రిప్లై కోసం మీరు చాలా ఎదురు చూస్తున్నారు కదూ?" అన్నాడు.

"అది మొదట్లో. ఇప్పుడు కాదు" అని సర్దిన పుస్తకాలు చేతిలోకి తీసుకుంది సుశీల.

"అంటే?" అన్నాడు తెల్లబోతూ. తనని చూడగానే పరవశించి చిరునవ్వులు చిందించడమో, కన్నీటిబొట్లు కురిపించడమో, ఇంత జాప్యానికి నిష్ఠూరాలాడడమో, ఏదో చేస్తుందనుకున్నాడు. ఆ సంభాషణలో మరో నాలుగు కవితలకు మేత దొరుకుతుందనుకున్నాడు. అదేమీ జరగకపోయేసరికి జరిగిందేమిటో క్షణాలలో గ్రహించాడు. "ఎవరో నా మీద మీకు చాలా చాడీలు చెప్పినట్టున్నారు" అన్నాడు నిష్ఠూరంగా.

"చాడీలు నమ్మేటంత మూర్ఖురాలిని కాను. అనవసరపు చర్చలెందుకు? మీరేం మాట్లాడాలనుకున్నారో అది చెప్పండి. నేను వెళ్ళాలి" అంది మొహం చిట్లిస్తూ.

"మీరీమధ్య చాలా రోజులు క్లాసుకి రాలేదు. మీతో స్వయంగా మాట్లాడదామనే నేను జవాబు రాయలేదు."

"మీ జవాబు కోసం ఎదురుచూడడం లేదని చెప్పాను కదా? పూర్తిగా తప్పు ఎడ్రస్‌కి రాశానా ఉత్తరం! మీతో మాట్లాడ్డం అనేది జరిగితే ఈ ఒక్క మాటే మీకు చెప్పాలనుకున్నాను" అని పుస్తకాలు తీసుకుని వెళ్ళబోయింది.

"ప్లీజ్! కొంచెం ఆగండి. ఎందుకంత అపార్థం చేసుకున్నారు నన్ను? మీ మనసు ఎందుకిలా మారిపోయింది? మీ ఉత్తరం జాగ్రత్తగా వుంచలేదనుకుంటున్నారా? ఎవరు చెప్పారు మీకు? కావాలంటే చూడండి. కావాలంటే మీ ఉత్తరం మీరు తీసుకోండి" అని జేబులోంచి ఒక కవరు తీసి "ఇదిగో మీ ఉత్తరం. తీసుకోండి" అంటూ కవరు సుశీల చేతికి ఇవ్వబోయాడు.

సుశీల చాలా నిర్లక్ష్యంగా "అక్కర్లేదు. మీ దగ్గిరే ఉంచుకోండి. ఇంకా చూపించని వాళ్ళెవరైనా వుంటే వాళ్ళందరికీ చూపించుకోండి!" అని గుమ్మం వేపు వెళ్ళిపోయింది.

['ఆంధ్రజ్యోతి' వారపత్రికలో, 29-2-1980 నించీ 3 వారాల పాటు] ★